
సాక్షి ఒడిశా

గురువారం । 14 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,52,683లు, బంగారం 4గ్రాముల 750 మిల్లీగ్రాములు, వెండి 10 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రతి నియోజకవర్గంలో ఆదర్శ పోలింగ్ కేంద్రం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల కోసం ఆదర్శ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) నికుంజ బిహారి ధొలొ తెలిపారు.

- 8లో.



న్యూస్‌రీల్

గంజాయి పంట ధ్వంసం



గంజాయిను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కుమ్మ నూర్ పంచాయతీ జోడాంమ్ గ్రామంలో రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటను పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. మొత్తం 2020 మొక్కలను పెట్రోల్ పోసి కాల్చివేశారు. ఈ సందర్భంగా ఐఐసీ చంద్రకాంత్ మాట్లాడుతూ.. గంజాయి సాగు, అక్రమ రవాణా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు అవధానాలు గొప్ప విషయం



మాట్లాడుతున్న శ్రీనివాస్, వేదికపై అపర్ణ, రమేష్ శర్మ తదితరులు

రాయగడ: పట్టణంలో ఒకే వేదికపై మూడు రకాల అవధానాలు జరగడం గొప్ప విషయమని విజయనగరానికి చెందిన ద్విశత అవధాని మరడాన శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక కల్యాణ వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఉత్కళాంధ్ర సేవా సమాజం ఆధ్వర్యంలో వరుసగా మూడోరోజు శతావధానం బుధవారం కొనసాగింది. దీనిలో భాగంగా శతావధానంతో పాటు ఘంటారావం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడ నాగరాజు, కొల్లూరు శేష సాయి, బుర్రా శ్రీనివాస్, అవసారాల నారాయణమూర్తి, టీఎస్ఆర్ మూర్తి, రేజేటి శ్రీరాంశర్మ తదితరులు పాల్గొన్నారు.

పాల ట్యాంకర్‌లో మంటలు



అగ్ని ప్రమాదంలో కాలిన పాల ట్యాంకర్

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి అవులి గ్రామ సమీపంలో ఓంఫెడ్ పాల ట్యాంకర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉమ్మరకోట్ నుంచి పాల ట్యాంకర్ జయపురం వస్తుండగా 26వ నంబర్ జాతీయ రహదారి బొరిగుమ్మ సమితి అవులి గ్రామం కూడలి వద్ద అకస్మాత్తుగా అగ్ని ప్రమాదానికి గురైంది. సమాచారం అందిన వెంటనే నబరంగపూర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అయితే అప్పటికే ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. అయితే ఈ అగ్ని ప్రమాదానికి కారణం ఏంటన్నది తెలియలేదు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి అనిల్ కుమార్ పండా

బరంపురం: ఈనెల 30వ తేదీన జరగనున్న గంజాం బార్ న్యాయవాదుల సంఘం 2023–24 ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ఘట్టం బుధవారంతో ముగిసింది. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో గంజాం బార్ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసినవారి వివరాలను ఎన్నికల అధికారి అనిల్ కుమార్ ప్రకటించారు. ఎన్నికల్లో అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది జగత్ మోహన్ పటాన్యాయక్, నయన్ చంద్ర మహాపాత్రో, మనోజ్ కుమార్ పట్నాయక్, ప్రదీప్ కుమార్ పండాలు నామినేషన్ వేసినట్లు వెల్లడించారు. అలాగే ఉపాధ్యక్ష పదవికి అనిల్ కుమార్ పండా, రామ్ ప్రసాద్ పండాలు, కార్యదర్శి పదవికి బిరంచి నారాయణ పండా, టి.వెంకటరావు, టిట్టు కుమార్ పాత్రో, సుదీర్ కుమార్ మిశ్రా, వైజయంత్ మాల పండా, జ్యోతి ప్రసాద్ చోట్రాయి, సహాయ కార్యదర్శి పదవి కోసం అజిత్ కుమార్ సబత్, గిరిజ శంకర్ బెహర పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల జరిగేరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బార్ సంఘం సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కార్యక్రమం, అనంతరం విజేతల ప్రకటన ఉంటుందని తెలియజేశారు.



మరికొన్ని.. గంటల్లో..!

- రాష్ట్రంలో పొత్తుకు అనుకూల పవనాలు
- ఢిల్లీలో అమిత్ షాతో రాష్ట్ర బీజేపీ నేతల భేటీ
- నవీన్ నివాస్‌లో సీనియర్ నాయకుల భేటీ నేడు

భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ పొత్తుపై ఎప్పుడైనా ప్రకటన వచ్చే అవకాశం ఉందనే ఊహాగానాల వినిపిస్తున్నాయి. అధికార, విపక్షాలుగా కొనసాగుతున్న ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారు చేసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు దిశలో ఉభయ బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ అధినేతలు వ్యూహాత్మకంగా పార్టీ శ్రేణులకు చెలిమి మంత్రం ప్రబోధిస్తున్నారు. అధినేతలు దాదాపు సానుకూలంగా కొలిక్కి వచ్చే సంకేతాలు బలపడుతున్నాయి. ఆదివారం నుంచి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ప్రముఖులు, వ్యవహారాల ఇన్‌చార్జి, ఎన్నికల ఇన్‌చార్జి న్యూఢిల్లీలో మకాం వేశారు. అధిష్టానం పిలుపు మేరకు వీరంతా ఢిల్లీకి వెళ్లారు. తాజాగా బుధవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. హోం మంత్రి అధికారిక నివాసంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, సంస్థాగత కార్యదర్శి మానస్ మహంతి, ఇతర సీనియర్ నేతలతో సమావేశం జరిగింది. ఒడిశా బీజేపీ ఇన్‌చార్జ్ విజయ్‌పాల్ సింగ్ తోమర్, ఒడిశా ఎన్నికల కో–ఇన్‌చార్జి ఉసెండి ఈ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బిజూ జనతా దళ్‌తో కలిసి పనిచేయడానికి రాష్ట్ర నాయకులను బుజ్జగించి అనుకూల బాటకు తీసుకువచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

నవీన్ మంతనాలు

బీజేపీతో పొత్తు బీజేడీకి కొత్తేమీ కాదు. ఇదివరకు బీజేపీ చేయూతతో రాష్ట్రంలో బీజేడీ పాలన పగ్గాలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. వర్ధమాన పరిస్థితుల నేపథ్యంలో సంక్లిష్ట పరిస్థితిని అధిగమించేందుకు సుమారు 15 ఏళ్ల తర్వాత మరోసారి ఈ రెండు వర్గాలు చేతులు కలిపేందుకు ఉరకలేస్తున్నాయి. బిజూ జనతా దళ్ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా దళపతులతో తరచూ సమావేశం అవుతున్నారు. ప్రధానంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల రాష్ట్ర పర్యటన తర్వాత పొత్తు మంతనాలు పుంజుకున్నాయి. ఈనెల 14వ తేదీన గురువారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నివాసం నవీన్ నివాస్‌లో తమ పార్టీ సీనియర్ నేతలతో సమావేశానికి పిలుపునిచ్చారు. ఇంతకుముందు ఈనెల 6న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన మర్నాడు నవీన్ పట్నాయక్ అధ్యక్షత పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం సుదీర్ఘంగా 3 గంటలకు పైబడి సాగింది. సమావేశం అనంతరం మాట్లాడిన బీజేడీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే దేవీ ప్రసాద్ మిశ్రా బీజేపీతో పొత్తు సంబంధిత చర్చ సానుకూలంగా ముగిసినట్లు పరోక్ష సంకేతాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఈ పొత్తుకు అంగీకారం కుదిరినట్లు ప్రకటించారు.

బీజేపీ నేతల సంశయం

అయితే మరోవైపు పొత్తు కుదరదని బీజేపీ రాష్ట్ర శాఖ ప్రముఖులు పలుమార్లు ఘంటాపథంగా ప్రకటించారు. దీంతో కూటమి సమస్యల పరిష్కారంలో అంతరాయం ఏర్పడింది. ఈ చిక్కు పరిస్థితుల్లో బీజేపీ అధిష్టానం రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్‌కు పిలుపునిచ్చింది. ఆయన సోమవారం న్యూఢిల్లీలో షాతో సమావేశం కావడంతో రాష్ట్రంలో బీజేడీతో పొత్తు వ్యవహారం ఖరారు అవుతుందనే సంకేతాలు మరోసారి ఊపందుకున్నాయి. ఈ ఊహ ప్రకారమే బుధవారం రాష్ట్ర శాఖ నాయకులను బుజ్జగించడంలో అధిష్టానం సఫలమైనట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో కూటమి అని బీజేడీ అంటుండగా, రాష్ట్రంలో పార్టీ ప్రయోజనాల కోసమే మైత్రి యోచనగా బీజేపీ శిబిరాల సమాచారం.

ఆధిపత్యం పెరిగేందుకు..

శాసనసభలో బీజేడీ, లోక్‌సభలో నరేంద్ర మోదీ ఆధిపత్యం దృఢపరచుకునేందుకు పొత్తు దోహదపడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. పార్లమెంటులో బీజేడీ, శాసనసభలో బీజేపీ మనుగడ లాంఛనమైపోయిన ఆశ్చర్యపడాల్సిందేమీ ఉండదు. ఈ రెండు వర్గాల కూటమితో కాంగ్రెసు లబ్ధిపొందే అవకాశాలు అక్కరకు రానే వస్తాయి. ఈ అవకాశాలను సమయస్ఫూర్తితో సద్వినియోగపరచుకుంటే దాదాపు అట్టడుగు స్థాయికి అడుగంటి పోయిన కాంగ్రెస్ ప్రధాన విపక్ష హోదాకు ఎదిగి శాసనసభలో ద్వితీయ స్థానానికి వచ్చే అవకాశం ఉంది. కాగా మరికొన్ని గంటల్లో బీజేడీ, బీజేపీ కూటమిపై ఉత్కంఠ తొలుగుతుందని సమాచారం. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ గణతంత్ర కూటమి ఎన్డీయే సమీకరణం ఖరారైన నేపథ్యంలో రాష్ట్రంలో బీజేడీతో పొత్తు ఖరారు అయ్యే అవకాశం ఉంది. గురువారం ఢిల్లీలో ఎన్డీయే కూటమి రాత్రి విందుకు రాష్ట్రం నుంచి బీజేడీ హాజరయ్యేందుకు సిద్ధమవుతోందని తెలుస్తోంది.

కమలా పూజారికి అస్వస్థత



చికిత్స పొందుతున్న పద్మశ్రీ కమలా పూజారి

భువనేశ్వర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత కమలా పూజారి కిడ్నీ సంబంధిత వ్యాధితో కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. న్యూ మెడిసిన్ వార్డు ఐసీయూలో చేర్చి ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ఆమెకి చికిత్స అందజేస్తోంది. ఆమె మూత్రపిండాలు, యూరిన్ ఇన్ఫెక్షన్, రక్తహీనతతో బాధపడుతోంది. ప్రొఫెసర్ జయంత్ పండా, ప్రొఫెసర్ బిజయ్ బెహరా, ప్రొఫెసర్ అరుణా ఆచార్య, ప్రొఫెసర్ అశోక్ మల్లిక్‌లతో కూడిన వైద్యుల బృందం చికిత్స అందిస్తోంది. ఇంతకుముందు జనవరి నెలలో జయపురం జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. 2022 సంవత్సరం ఆగస్టులో ఆమెకు కిడ్నీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సాహం, వరితో సహా వివిధ పంటలకు చెందిన 100 రకాల దేశీయ విత్తనాలను సంరక్షించినందుకు కమలా పూజారికి 2019లో భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది.

తుంబా ఘాట్‌లో కారు బోల్తా



బోల్తాపడిన కారు



గాయపడిన ప్రయాణికులు

బరంపురం: నగర శివారులోని 59వ జాతీయ రహదారి బుడిగొర జంక్షన్‌లో అస్కా నుంచి దిగపండి వెళ్తున్న కారు తుంబా ఘాట్ రోడ్డులో బుధవారం బోల్తా పడింది. ప్రమాద సమయంలో కారులో 8 మంది ప్రయాణిస్తుండగా, నలుగురు మహిళలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న సదర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కారులో ప్రయాణిస్తున్నవారిని రక్షించారు. గాయాలుపాలైనవారు ఎంకేసీజీ ఆస్పత్రిలో వైద్యుల సాయంతో చికిత్స పొందుతున్నారు. సదర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మ అవార్డు గ్రహీతలకు గౌరవ వేతనం

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన పద్మ అవార్డు గ్రహీతలకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.25,000 చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ చెల్లింపు అమల్లోకి వస్తుంది. ప్రతినెలా ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించారు. పద్మ పురస్కారాలు భారతదేశ అత్యున్నత పౌర గౌరవాల్లో ఒకటి. వివిధ రంగాల్లో అద్భుతమైన కృషి చేసి దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన వ్యక్తులకు ఈ సన్మానాన్ని అందజేస్తారు. రాష్ట్రానికి చెందిన పద్మ అవార్డు గ్రహీతలు ఒడిశా సంస్కృతి మరియు వారసత్వానికి కొత్త శిఖరాలపై పట్టం గట్టిన అసాధారణ విజయాలను గుర్తించి ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించాలని నిర్ణయించిందని ముఖ్యమంత్రి వివరించారు.

బాధ్యతల స్వీకరణ



అనిల్ కుమార్

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా ఎస్.అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ (ఐఆర్‌టీఎస్) 2013 సంవత్సరం బ్యాచ్ అభ్యర్థి. ఇంతకుముందు ఖుర్దారోడ్ మండలంలో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (మూవ్‌మెంట్)గా బాధ్యతలు నిర్వహించారు. భారతీయ రైల్వే సేవా రంగంలో 10 ఏళ్ల స్వల్ప వ్యవధి అనుభవంలో పలు కీలకమైన శాఖల్లో బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. అనిల్ కుమార్ ఉన్నత విద్యాభ్యాసం హైదరాబాద్‌లో కొనసాగింది. 2004లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్‌లో పట్టభద్రులుగా ఉత్తీర్ణులయ్యారు. భారతీయ రైల్వేలో పలు శాఖల్లో వివిధ హోదాల్లో అసిస్టెంట్ ఆపరేషన్స్ మేనేజర్ (కంట్రోల్), అసిస్టెంట్ ఆపరేషన్స్ మేనేజర్ (కోచింగ్), విశాఖపట్నం డివిజన్‌లో ఏరియా మేనేజర్ (వాల్తేరు మార్షలింగ్ యార్డ్), ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (సరకు రవాణా సేవలు)గా పని చేశారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



నవ దంపతులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సరక తదితరులు

- మంత్రి సరక పిలుపు

రాయగడ: బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. జిల్లాలోని బిసంకటక్ సమితి చాటికొనలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో చిన్నారుల బంగారు భవిష్యత్ నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమితి పరిధిలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న అత్యధిక మంది డొంగిరియా తెగకు చెందిన ప్రజల్లో బాల్య వివాహాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుండడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వారు ఆర్థిక, సామాజిక రంగాల్లో బాగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి సంక్షేమం కోసం చేస్తున్న ప్రయత్నాలు బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయన్నారు. అయితే గత కొద్దికాలంగా చైతన్యం రావడం జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డొంగిరియా కొండొ డవలప్‌మెంట్ ఏజెన్సీ, ఒపిలిపి సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహంతో యువత విద్యావంతులుగా ఎదిగారన్నారు. అయితే బాల్య వివాహాల విషయంలో మరింత చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల వివాహాలు చేసుకున్న 12 జంటలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అమో ఒడిశా నవీన్ ఒడిశా జిల్లా సమన్వయకర్త పట్నాన గౌరి శంకర్, డీకేడీఏ అధికారి సదర్శన్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగా 125 స్థానాల్లో గెలుస్తాం

- ఢెంకనాల్ ఎమ్మెల్యే సుధీర్ సామల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ సామల్

భువనేశ్వర్: బీజేడీ, బీజేపీ పొత్తుపై గురువారం నాటికి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ఊహాగానాల మధ్య, రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేడీ ఒంటరిగా పోటీచేస్తే 125 అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడం ఖాయమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఢెంకనాల్ ఎమ్మెల్యే సుధీర్ సామల్ నొక్కి చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మీడియా ఊహాగానాలు చేస్తున్న పొత్తు చర్చల గురించి తనకు తెలియదన్నారు. బీజేడీ 2024 ఎన్నికల్లో ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శనతో తన సంఖ్యను మెరుగుపరుచుకోవాలని చూస్తోందని తెలియజేశారు. 125 అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని, మొత్తం 21 లోక్‌సభ స్థానాలను కూడా కైవసం చేసుకోవాలనే యోచనతో కొనసాగుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో 75 శాతం అసెంబ్లీ సీట్లను సాధించి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ప్రభుత్వం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర ప్రజల అభిమాన పార్టీగా వెలుగొందుతుందన్నారు. 2022 సంవత్సరంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీజేడీ 90 శాతం కంటే ఎక్కువ జిల్లా పరిషత్ స్థానాలను గెలుచుకుందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో మొత్తం 30 జిల్లాల్లో జిల్లా పరిషత్‌లను బీజేడీ ఏర్పాటు చేసిందన్నారు. ఈ విజయం ఒడిశాలో గతంలో ఏ పార్టీ సాధించని ఘనతగా పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ క్లీన్ స్వీప్ చేసిందని చెప్పారు.

సైబర్ ఉచ్చులో వైద్యుడు

- అకౌంట్ నుంచి 3.21 లక్షలు మాయం

రాయగడ: ఒకవైపు సైబర్ నేరాలపై పోలీసులు నిరంతరం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ వాటిబారిన పడుతున్న బాధితుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. తాజాగా ఒక వైద్యుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని తన భార్య అకౌంట్ నుంచి రూ.3.21 లక్షలు పోగొట్టుకొని పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఐఐసీ కమలాకాంత్ కుహరో తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బ్యాంక్ కాలనీలో ఉంటున్న ప్రముఖ వైద్యుడు నవకిషోర్ కుండుకు మంగళవారం ఆర్మీలో పనిచేస్తున్నానని ఒక వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను చికిత్స పొందాలని అనుకుంటూ ఉన్నాడని, దీనికోసం ముందుగా యూపీఐ ద్వారా పేమెంట్ చేస్తానని తెలియజేశాడు. అందుకు అంగీకరించిన వైద్యుడు తన భార్య రుబి కుండు ఫోన్‌కు పేమెంట్ చేయమని చెప్పారు. ఈ క్రమంలో యూపీఐ నంబర్ ద్వారా వచ్చిన లింక్‌ను క్లిక్ చేయమని సైబర్ నేరగాడు సలహా ఇచ్చాడు. దీంతో అతను లింక్ మీద క్లిక్ చేసిన కొద్ది నిమిషాల్లోనే అకౌంట్ నుంచి రూ.3.21 లక్షలు కట్ అయ్యాయి. దీంతో తాము మోసపోయామని గమనించిన వైద్యుడు నవకిషోర్ కుండు, ఆయన సతీమణి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

లేబర్ కార్యాలయం ముట్టడికి నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న ప్రమోద్ మహంతి తదితరులు

జయపురం: పలు విభాగాలకు చెందిన విశ్రాంత కార్మికులకు రావాల్సిన ప్రయోజనాల కోసం స్థానిక డిప్యూటీ లేబర్ కార్యాలయం ముట్టడించాలని కార్మికులు నిర్ణయం తీసుకున్నారు. స్థానిక కార్మిక భవనంలో సేవా పేపర్ మిల్లు విశ్రాంత కార్మికులు, ఈపీఎఫ్ పెన్షన్‌దారుల అసోసియేషన్లు సంయుక్తంగా కార్మిక నేత ఉమాకాంత రథ్ అధ్యక్షతన సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా విశ్రాంత కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పేపరు మిల్లు కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. విశ్రాంత కార్మికుల సమస్యలపై వివరించారు. విశ్రాంత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడం వలన వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీసం నెలకు కనీసం రూ.900 లు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్నటువంటి విశ్రాంత కార్మికులకు బిజూ ఆరోగ్య పథకంలో మమేకం చేయాలన్నారు. ఈ మేరకు ఈనెల 17వ తేదీన మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో జయంత శాంత, రామ శంకర పట్నాయక్, జి.ప్రసాదరావు, సురేష్ రథ్, నారాయణ దాస్, అలేఖ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జింకపిల్లతో ముగ్గురు అరెస్టు

పర్లాకిమిడి: గుసాని సమితి లావణ్య గడ్డ గ్రామ అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద జింక పిల్లను తీసుకెళ్తున్న ముగ్గురు నిందితులను అధికారులు పట్టుకున్నారు. నిందితుల్లో గుమ్మ సమితి గైబా గ్రామానికి చెందిన మేసియా భుయ్యాన్, అభిహా భుయ్యాన్, తేసాన్ భుయ్యాన్‌లు ఉన్నట్లు గుర్తించారు. నిందితులు మోటార్ వాహనంలో జింకపిల్లతో పాటు దాని మాంసం తరలిస్తుండగా మహేంద్రగిరి అటవీ రేంజ్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు డీఎఫ్‌వో ఎస్.ఆనంద్, ఏసీఎఫ్ అరుణ్ కుమార్ సాహు ఆదేశాల మేరకు ఈ దాడులను నిర్వహించినట్లు సమాచారం.

అదనపు కలెక్టర్‌గా త్రినాథ్


బాధ్యతలు చేపట్టిన త్రినాథ్ మాఝి

రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్‌గా త్రినాథ్ మాఝి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇదివరకు మల్కన్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసేవారు. ఆయనకు కార్యాలయం సిబ్బంది, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన మాఝి స్థానిక అటానమస్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్, ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ శిబిరంలో ప్రసంగించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయన తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. సజావుగా ఎన్నికలు జరిగే తీరును గురించి అధికారులకు వివరించారు.

కొరియర్ పేరిట సైబర్ మోసం

శ్రీకాకుళం క్రైమ్ : హలో.. ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్ సర్వీస్.. హౌ కెన్ హెల్ప్ యూ.. అంటూ మన ఫోన్ లైన్ కలుపుతారు. మాట్లాడామా.. ఇక అంతే సంగతులు.. కొరియర్ ముసుగులో.. మన ఖాతాలోని డబ్బులు అలవోకగా కొట్టేస్తారు. జిల్లాలో తాజాగా ఈ తరహా కేసు నమోదు కాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు గత నెలాఖరున ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామంటూ కొందరు ఫోన్ చేశారు. తైవాన్ నుంచి ముంబై అడ్రస్‌కు మీ పేరిట పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉండటంతో నార్కోటిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, దీనిపై ముంబై క్రైమ్ బ్రాంచి పోలీసులు కానీ ఢిల్లీ పోలీసులు కానీ కాల్ చేస్తారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత ముంబై పోలీసులమంటూ కొందరు వీడియో కాల్ చేశారు. పార్సిల్‌లో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్టు ఉన్నాయని, మీపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నామని బెదిరించారు. యువకుడు పార్సిల్ నాకే ఎందుకొచ్చిందని ప్రశ్నించగా నీవు పనిచేసే కంపెనీ, నీవు డ్రగ్స్ కావాలంటూ ఆన్‌లైన్‌లో పెట్టిన ఆర్డర్ అంతా మా వద్ద ఉన్నాయని.. స్టేట్‌మెంట్ రికార్డింగ్ అంటూ హడావిడి చేసి ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు తీసుకున్నారు. జరిమానా కింద రూ.30 లక్షల వరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇవ్వడం కుదరదని యువకుడు చెప్పడంతో నీపై మనీ లాండరింగ్ కేసు అవుతుందని, సీబీఐ, కస్టమ్స్ పోలీసులు మీ ఇంటికొస్తారని హడలెత్తించడంతో పరువు పోతుందేమోనని యువకుడు భయపడ్డాడు. చేసేదేమీ లేక ఈ నెల దఫదఫాలుగా రూ.20 లక్షల వరకు వారు చెప్పిన ఖాతాల్లోకి మళ్లించాడు. అయినా ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో మోసానికి గురయ్యానని గుర్తించి 1930 సైబర్‌సెల్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు.

అరసవల్లి ఆలయ ఈవోగా చంద్రశేఖర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను అరసవల్లికి, ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న డీఎల్‌వీ రమేష్‌బాబుకు అన్నవరం డిప్యూటీ ఈవోగా బదిలీ చేశారు. కొత్తగా డీసీ హోదాలో రానున్న చంద్రశేఖర్ గతేడాది నాలుగు నెలల పాటు శ్రీకాకుళం జిల్లా దేవదాయ శాఖాధికారిగా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు అరసవల్లి ఆలయానికి డీసీ హోదాలో మళ్లీ రానున్నారు. గురువారం ఉదయం అరసవల్లిలో ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

యువతి అనుమానాస్పద మృతి

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన కర్రి ఊర్వశి(19), అదే గ్రామానికి చెందిన బి.శ్యాం కుమార్ ప్రేమలో పడి ఊరు విడిచి వెళ్లిపోయారు. ఇటీవలే ఇద్దరూ గ్రామానికి తిరిగి వచ్చేశారు. శ్యాంకుమార్ ఇంట్లోనే ఊర్వశి ఉంటోంది. బుధవారం ఉదయం ఇంట్లో శ్యాంకుమార్, కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఊర్వశి తాడుతో ఉరివేసుకుని మృతి చెందింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వీరు మరికొద్ది రోజుల్లో పెళ్లిచేసుకునేందుకు కూడా సిద్ధమైనట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఏఎస్ఐ కూర్మారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి తల్లి కర్రి పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కవిటి ఎస్ఐ కె.రాము తెలిపారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రతి నియోజకవర్గంలో
ఆదర్శ పోలింగ్ కేంద్రం

● సీఈవో నికుంజ బిహారి ధొలో


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీలు

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల కోసం ఆదర్శ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) నికుంజ బిహారి ధొలో తెలిపారు. ఎన్నికల సన్నద్ధత పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో వర్చువల్‌గా బుధవారం సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాలుపంచుకునే రీతిలో అనుబంధ యంత్రాంగం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాధారణ, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. నిర్భయంగా ఓటు వేయడం ప్రజాస్వామ్యానికి ప్రతీకగా పేర్కొన్నారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి విచ్చేసిన అన్నివర్గాల ఓటర్లకు అనుకూల సౌకర్యాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శ పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంగణాల్లో స్నేహపూర్వక వాతావరణంలో పూర్తిగా పాలిథిన్ రహిత పదార్థాలతో స్వచ్ఛమైన పర్యావరణంతో ఆదర్శ పోలింగ్ కేంద్రాలు రూపుదిద్దుకుంటాయి. అతి తక్కువగా ప్రతీ శాసనసభ నియోజకవర్గంలో కనీసం 20 శాతం చొప్పున ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ప్రారంభించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిలో 5 పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా యువకులు నిర్వహిస్తారు. దివ్యాంగులకు ఒక పోలింగ్ కేంద్రం, దాదాపు 10 శాతం పోలింగ్ కేంద్రాలను మహిళలు ప్రత్యేకంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ 3వర్గాల ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బంది నుంచి ప్రిసైడింగ్ అధికారి వరకు యువకులు, దివ్యాంగులు, మహిళలను నియమిస్తారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు.

రూ.25 వేల గ్రాంట్

ఒక్కో ఆదర్శ పోలింగ్ కేంద్రానికి కనీస మౌలిక వసతులు కల్పించేందుకు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ద్వారా రూ.25,000 గ్రాంట్‌ను అందజేస్తారు. గరిష్ట ఓటర్లను తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ఆకర్షించేందుకు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా మార్చేందుకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు. ప్రతి మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఓటర్లకు స్వాగతం పలికేందుకు పోలింగ్‌స్టేషన్లలో అందమైన స్వాగత ద్వారం, స్వాగత మస్కట్, రెడ్ కార్పెట్ మరియు పువ్వులు, సెల్ఫీ జోన్, చిన్న పిల్లలకు ఆట స్థలం, ఓటర్లకు కుర్చీ మొదలైన సౌకర్యాలు విశేషంగా ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తారు. బూత్ సిబ్బంది ఓటర్లతో వినయంగా, మర్యాదగా ప్రవర్తించడం అనివార్యంగా పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్న ఓటర్ల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలో బ్రెయిలీ సౌకర్యాలు అందుబాటులో ఉంచుతారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ (స్టాండ్‌బై), సీలింగ్ ఫ్యాన్లు, కూలర్లు, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగు దొడ్లు, తాగునీరు, ఓటర్ల కోసం వెయిటింగ్ ఏరియా, వికలాంగులకు ర్యాంపులు, చక్రాల కుర్చీలు, వాలంటీర్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సీఈవో తెలిపారు. ఆదర్శ పోలింగు కేంద్రాల్లో డిస్‌ప్లే బోర్డు, ఓఆర్ఎస్ ప్యాకెట్, మెడికల్ కిట్, ప్రథమ చికిత్స మొదలైనవి అందుబాటులో ఉంటాయని వివరించారు.

ఓటరు గైడ్

ఓటరు సౌలభ్యం కోసం ఓటరు గైడ్‌ను పాకెట్ బుక్‌గా అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఓటరు కుటుంబానికి ఈ పుస్తకం అందజేస్తారు. ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం(సీఈఓ) ఈ ప్రక్రియ నిర్వహిస్తుంది. ఈ చిన్న పుస్తకం ఓటు హక్కు వినియోగం సమగ్ర సారాంశం, వివరాలను తెలియజేసి, ఓటు వేసేందుకు ప్రేరేపిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు బీఎల్‌వోలు ఈ పుస్తకాలు పంపిణీ చేస్తారు.

సీఎం నవీన్ నివాస్ ముట్టడికి యత్నం


బారికేడ్లపై నుంచి వెళ్తున్న ఆందోళనకారులు

భువనేశ్వర్: రాష్ట్రంలో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ సయ్యద్ నాసిర్ నవాజ్ ఆధ్వర్యంలో ప్రదేశ్ విద్యార్థి కాంగ్రెస్ సభ్యులు బుధవారం ఆందోళనకు దిగారు. దీనిలో భాగంగా సీఎం నవీన్ నివాస్ ముట్టడికి విఫలయత్నం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రగా వేధిస్తోందని మండిపడ్డారు. ఏటా 2 లక్షల మందికి ఉద్యోగాల నినాదంతో గద్దెనెక్కిన నవీన్ సర్కార్, 24 ఏళ్ల సుదీర్ఘ పాలనలో 48 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దేశ, రాష్ట్ర పురోగతిలో భాగస్వాములైన విద్యార్థి వర్గానికి ఏ మాత్రం ప్రాతినిధ్యం లేని దయనీయ పరిస్థితులను ప్రభుత్వం కల్పించిందన్నారు. 2018 సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘం ఎన్నికలను నిలిపివేయడం అప్రజాస్వామ్య చర్యగా అభివర్ణించారు. రాష్ట్రంలోని 12 ప్రభుత్వ విశ్వ విద్యాలయాల్లో 57 శాతం అధ్యాపక పదవులు, 51 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 45 శాతం ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా వ్యవస్థపై దృష్టి సారించాలని కోరారు. ఆందోళనలో భాగంగా స్థానిక రాజమహల్ కూడలి నుంచి శిశు భవన్ మార్గం గుండా నవీన్ నివాస్ వైపు దూసుకుపోయిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

గోవులు తరలిస్తున్న ట్రక్ సీజ్


గోవులను తరలిస్తున్న ట్రక్కు

బరంపురం: గంజాం–గజపతి జిల్లాల సరిహద్దు తప్పపాణి ఘాట్ రోడ్ నుంచి బరంపురం నగరం మీదుగా అక్రమంగా గోవులను తరలిస్తున్న ట్రక్కును పోలీసులు సీజ్ చేశారు. చమ్మఖండి ఐఐసీ అధికారి రామచంద్ర మహంతి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి నుంచి బరంపురం మీదుగా బీహార్ వెళ్తున్న వ్యాన్‌లో గోవులు అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో చమ్మఖండి పోలీసు అధికారులు మాటువేసి నగరానికి దగ్గర జాతీయ రహదారి పుకిడిబందా నాలుగు రోడ్ల జంక్షన్లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అక్రమంగా గోవులను తరలిస్తున్న ట్రక్కును సీజ్ చేశారు. అయితే నిందిత డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రకొండ సమితి కార్యాలయం ముట్టడి

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమితిలోని 18 పంచాయతీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రతీ గ్రామానికి తాగునీరు అందజేయాలని, చిత్రకొండ మార్కెట్‌కు రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని, ప్రతి పంచాయతీలో రేషన్ సరుకులు, పింఛన్లు అందజేయాలని పేర్కొన్నారు.

ఈ విధంగా మొత్తం 15 డిమాండ్లతో వినతిపత్రాన్ని సమితి అభివృద్ధి అధికారి తాన్మయి పాత్రోకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవిందపాత్రో, సీనియర్ నాయకులు శరత్ బురద, మంగు ఖీలో తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోవింద పాత్రో


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

లోయలోకి దూసుకెళ్లిన లారీ

● కిల్లాం, జమ్ములకు చెందిన క్లీనర్, డ్రైవర్లు మృతి
● ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లాలో ప్రమాదం

నరసన్నపేట: ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలానికి చెందిన ఇద్దరు మృత్యువాతపడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిల్లాం గ్రామానికి చెందిన గొలివి ఆదినారాయణ (44), జమ్ముకు చెందిన కొయ్యాన చిన్నారావు(34)లు లారీ డ్రైవర్, క్లీనర్స్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం నేపాల్ సరిహద్దులకు లోడు తీసుకొని పయనమయ్యారు. ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లా బైరపడా వద్దకు రాత్రి 11.30 సమయానికి వెళ్లే సరికి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోతైన ప్రదేశంలో బోల్తా పడింది. ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వేకువజామున ఇరు కుటుంబాలకు సమాచారం అందడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆదినారాయణకు తల్లిదండ్రులు రాములు, తవిటమ్మ, భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్నారావుకు భార్య శశికళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మయూర్‌భంజ్‌కు కుటుంబ సభ్యులు తరలివెళ్లారు.



కిడ్నీ బాధితులకు కొండంత అండ

ఎలా సంక్రమిస్తుందో.. తెలీదు.. దాన్ని ఎలా అడ్డుకోవాలో అంతకంటే తెలీదు. ఫలితంగా దశాబ్దాలుగా దాని దాడికి వేలాది వ్యక్తులు, వందలాది కుటుంబాలు గురయ్యాయి. అప్పులను పోగొట్టుకున్నారు కొందరైతే.. వైద్యానికి ఆస్తులను కరిగించేసి రోడ్డున పడిన వారెందరో. ఈ మహమ్మారి నుంచి తమను రక్షించేవారే లేరా అని బిక్కచచ్చిపోయి.. బిక్కుబిక్కుమంటున్న తరుణంలో నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ ముందుకొచ్చి అభయహస్తం అందించారు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. డయాలసిస్ సెంటర్లు పెంచారు.. డయాలసిస్ రోగులకు ఖర్చుల కోసం నెలకు రూ.10 వేల పెన్షన్ ఇస్తున్నారు. కిడ్నీ పరిశోధనలు, సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం పలాసలో ఆస్పత్రి, రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉద్దానం కిడ్నీ బాధితులకు కొండంత అండగా నిలిచారు. నేడు కిడ్నీ దినోత్సవం సందర్భంగా కిడ్నీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం, సేవలపై ప్రత్యేక కథనం.

- డయాలసిస్ రోగులకు రూ.10,000 పెన్షన్ చెల్లింపు
- ఉద్దానానికి శుద్ధజలం సరఫరా
- పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం



కవిటి: గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన కిడ్నీ బాధితులకు నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారు. నేను చూశాను..నేను విన్నాను..నేను ఉన్నాను అంటూ 2019లో జరిగిన ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలను అధికారంలోకి వచ్చాక కార్యరూపం దాల్చి అండగా నిలుస్తున్నారు. ప్రత్యేకించి ఉద్దానం ప్రాంతంలో అంతుచిక్కని కారణాలతో వ్యాధి బారిన పడుతున్న వేలాది మంది కిడ్నీ బాధితుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. పలాసలో కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, రూ.800 కోట్లతో వైఎస్సార్ సుజలధార పథకం కింద ఇంటింటికీ రక్షిత మంచినీరు, డయాలసిస్ రోగులకు రూ.10,000 పెన్షన్ అందించి బాధితులకు బతుకుపై భరోసా కల్పించారు. జిల్లాలో రిమ్స్ ఆస్పత్రితో పాటు టెక్కలి, హరిపురం, పలాస, సోంపేట, కవిటి మండలాల్లో పడకల సంఖ్యను భారీగా పెంచి ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రోగులకు నిరాటంకంగా డయాలసిస్ సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు.

గాలికొదిలేసిన టీడీపీ..

- టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు అరకొరగా బెడ్లు ఉండేవి. నేడు వాటి సంఖ్యను భారీగా పెంపుదల చేశారు. అప్పట్లో తూతూ మంత్రంగా చెల్లించిన రూ.2000 డయాలసిస్ పెన్షన్ బాధితులకు ఏ మూలకూ సరిపోలేదు. ఎన్నికల సమీపించే సమయంలో చివరి రెండు మూడు నెలలు రూ.3000కు పెంచి మమ అనిపించేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కిడ్నీ రోగుల పట్ల ప్రత్యేక దృష్టి సారించారు. డయాలసిస్ రోగులకు ఏకంగా రూ.10,000 పింఛన్ పెంచి అండగా నిలిచారు.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఆధునిక జీవనశైలి మనిషి జీవనాన్ని యాంత్రికంగా మార్చేసింది. విద్యార్థులు ఆటస్థలాలకు తక్కువ సమయం కేటాయించడం, యువతీ యువకులు వ్యాయామానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఎక్కువ శాతం మంది బీపీ, షుగర్ వ్యాధుల బారినపడుతున్నారు. ఈ వ్యాధులకు సరైన రీతిలో మందులు వాడకపోవడంతో దుష్ప్రభావాలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా కిడ్నీల పనితీరు మందగించి డయాలసిస్ స్థితికి చేరుకుంటున్నాయి.
- ఈ నేపథ్యంలో మార్నింగ్‌వాక్, యోగా, మెడిటేషన్ వంటి శారీరక వ్యాయామాల్ని ఆచరించడం ద్వారా కిడ్నీల పనితీరును కాపాడుకోవచ్చు. ప్రధానంగా ఫాస్ట్‌ఫుడ్ ఆహారానికి దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్ స్థానంలో తక్కువ కేలరీలు గల పండ్లు తినాలి.
- వ్యాయామం తప్పనిసరి చేసుకోవాలి.

ఆదుకుంటున్న ఆశాకిరణం


పలాస కిడ్నీ ఆస్పత్రిలో గ్రాఫ్ట్ ఆపరేషన్ అనంతరం భవానీతో వైద్య బృందం

కాశీబుగ్గ : ఉద్దానం ఆశాకిరణంగా భావిస్తున్న పలాస కిడ్నీ ఆస్పత్రి తన పని మొదలుపెట్టింది. ఇన్నాళ్లూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం శ్రీకాకుళం, ఆపరేషన్ల కోసం విశాఖకు పరుగులు పెట్టిన జిల్లా వాసులకు ఇప్పుడు పలాసలోనే శస్త్ర చికిత్స చేయించుకునే భాగ్యం లభించింది. పలాసకు దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న లావేరు మండలం నుంచి వోయివోని భవానీ అనే పేషెంట్ ఇటీవల కిడ్నీ ఆస్పత్రికి వచ్చి ఏవీఎఫ్ గ్రాఫ్ట్ అనే ఆపరేషన్ చేయించుకున్నారు. డయాలసిస్ పేషెంట్లకు నరాలు బలహీనమైపోయిన దశలో ఓ యంత్రం అమర్చి దాని ద్వారా రక్తశుద్ధి చేసి శరీరంలోకి రక్తం పంపడం ఈ ఆపరేషన్ ఉద్దేశం. ఇన్నాళ్లూ ఈ శస్త్ర చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వేలాది రూపాయలు ధారబోయాల్సి వచ్చేది. ఇప్పుడు కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఉచితంగా జరగడంతో వేలాది మందికి భరోసా ఏర్పడింది.


ఉద్దానం ముద్దుబిడ్డ జగనన్న



కాశీబుగ్గలో కిడ్నీరీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసిన ఉద్దానం ముద్దుబిడ్డగా సీఎం జగన్ నిలిచారు. రూ.800 కోట్లవ్యయంతో ఉద్దానం ప్రజలకు సురక్షిత ఉపరితల జలాలతో తాగునీటి పథకం ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించారు. ఇటీవల ఏపీహెల్త్ కమిషనర్ జి.నివాస్ దృష్టికి ఉద్దానం కిడ్నీవ్యాధుల సమస్య తెలియజేయగా ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో ఐదు డయాలసిస్ యూనిట్లతో కేంద్రం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారు.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

క్రమబద్ధంగా వైద్యపరీక్షలు..



క్రమంతప్పని వ్యాయామంతో పాటు ఆహారంలో చక్కెర, ఉప్పు బాగా తగ్గించాలి. హైబీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారు మూడు నాలుగు నెలలకోసారి సీరంక్రియేటినైన్ పరీక్షించుకోవాలి. నిర్ణీత పరిమాణంలో నీటిని తాగాలి. డయాలసిస్ చేయించుకుంటున్న వారు నీటిని పరిమితంగా తీసుకోవాలి.

– డాక్టర్ రాయపురెడ్డి రంగనాథరావు, నెఫ్రాలజిస్ట్, శ్రీకాకుళం

మేలు మరువలేం..



డయాలసిస్ రోగులకు నెలవారీ అందిస్తున్న రూ.10,000 పెన్షన్ మా జీవితాలకు ఓ భరోసా ఇచ్చింది. మాలాంటి వారికి అప్పు కూడా పుట్టని స్థితిలో ఆ పెన్షన్ ఆదుకుంటోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేలు మరువలేనిది.

–బి.సూరయ్య, కొత్తపుట్టుగ, కవిటి మండలం


కవిటి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

క్లుప్తంగా

'పీఎం సూరజ్' కింద రూ.9.67 కోట్లు పంపిణీ



సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్‌కు పీపీఈ కిట్లను అందజేస్తున్న సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం అర్బన్: పీఎంసూరజ్ పథకం కింద ఎస్సీ, ఓబీసీ, సఫారీ కర్మచారి కార్మికులకు సంబంధించి జిల్లాలోని 93 మంది లబ్ధిదారులకు రూ.9.67 కోట్లను సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్ బుధవారం అందజేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా పీఎంసూరజ్ కింద లక్ష రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని దేశంలోని 522 జిల్లాల నుంచి వీక్షించగా విజయనగరం నుంచి కలెక్టరేట్ ఆడిటోరియంలో సహాయ ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్‌తోపాటు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ రామానందం, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, విజయనగరం, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లు, మల్లయ్య నాయుడు, బాలాజీ ప్రసాద్, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ ద్వారా పలు పథకాల కింద రుణాలను అందజేశారు. ఆయుష్మాన్ హెల్త్ కార్డులను పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్‌కు పీపీఈ కిట్లను పంపిణీ చేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



సాధించిన పతకాలు అందుకుంటున్న ఎంవీఎస్ మూర్తి

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన ఎం.ఎస్.ఎన్.మూర్తి కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన సౌత్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పో టీల్లో 80+ విభాగంలో పోటీపడి ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఆయన 40మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్‌లో వెండి పతకాలు, జావెలిన్‌త్రోలో కాంస్యపతకం సాధించారు. గతంలో పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన మూర్తి ఎనిమిది పదుల వయసుల్లో పతకాలు సాధించడం పట్ల స్థానిక 'స్నేహ' స్వచ్ఛంద సేవా సంస్థ, పుణ్యగిరి వాకర్స్ క్లబ్ సభ్యులు, ఎఫ్‌బీఏ అకాడమీ చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గజపతినగరం: మండల కేంద్రంలోని కోవెల వీధిలో నివాసం ఉంటున్న బాలి గౌరి(36) మంగళవారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొన్ని రోజులుగా గౌరి అనారోగ్యంతో ఉంది. ఆరు సంవత్సరాలుగా పిల్లలు కలగక పోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బోని గున్నమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి..

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసకు చెందిన బద్దు రాము (42) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై భాస్కరరావు బుధవారం తెలిపారు. గుజ్జింగివలసకు చెందిన రాము వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవల మద్యం అధికంగా తాగుతూ ఉండడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందును ఈనెల 1వ తేదీన తాగేశాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన శ్రీరామ్

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలస గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీరామ్ (37) అదృశ్యమైనట్లు భార్య ఆదిలక్ష్మి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. శ్రీరామ్ ఈనెల 6వ తేదీన భార్యాపిల్లల దగ్గరకు విశాఖ పట్నం వెళ్లేందుకు పెదమేరంగి కూడలిలో మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నం వెళ్లే నీల కంఠాపురం ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కడు. అయితే నేటివరకు తన భర్త ఇంటికి చేరలేదని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు.

అగ్రవర్ణ పేదలకు ఆర్థిక సాయం

- నేడు నంద్యాల జిల్లాలో నిధులు విడుదల చేయనున్న సీఎం
- ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఖాతాల్లో జమ

పార్వతీపురంటౌన్: అగ్రవర్ణ పేదల సంక్షేమానికి గత టీడీపీ ప్రభుత్వం మొండిచేయి చూపింది అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారికి అపన్నహస్తం అందించి కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, వెలమ, ఇతర అగ్రవర్ణ పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.15 వేలు వారి ఖాతాల్లో నేరుగా జమచేసి ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు. ఇప్పటికే రెండవ విడత ఆర్థిక సాయం చేయగా మూడవ విడత నగదు గురువారం జమ చేయనున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వారు ఎవరైనా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపులతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అండగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే గతంలో ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికి సంబంధించి మూడవ విడత ఈబీసీ నేస్తం నిధులను గురువారం విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా బనగనాపల్లికి గురువారం రానున్నారు. ఈబీసీలలో ప్రధానంగా రాష్ట్రంలో కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్య, వైశ్య, క్షత్రియ, వెలమ సామాజిక వర్గాలతోపాటు ఇతర అగ్రవర్ణాల పేదలు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారు.



ఈబీసీ నేస్తం నమూనా చెక్కు

ఆర్థిక వెసులుబాటు కలిగింది

సీఎం జగన్ మోహన్ రెడ్డి మాలాంటోళ్ల జీవనం కోసం ఈబీసీ నేస్తం పెట్టి సంవత్సరానికి రూ.15వేలు ఇస్తున్నారు. అప్పులు చేయకుండా మాకు ఈబీసీ నేస్తం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

– రాల్లపల్లి దుర్గనూకేశ్వరి, జగన్నాథపురం

పేదవారికి అండగా ప్రభుత్వ పథకాలు

వైఎస్సార్ ఈబీసీ నేస్తం మా కుటుంబానికి అండగా నిలిచింది. ప్రభుత్వం అందించే పథకాలు మాలాంటి పేదవారికి అండగా ఉంటున్నాయి. మా లాంటి వారిని గత ప్రభుత్వాలు కనీసం పట్టించుకోలేదు. మా లాంటి పేదవారికి అండగా నిలిచిన జగనన్నకు కృతజ్ఞతలు.

– పి.ఉమారాణి, పార్వతీపురం

మన్యం జిల్లాలో 1193 మందికి లబ్ధి..

పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కురుపాం 108, పాలకొండ 154, పార్వతీపురం 428, సాలూరు 503 మంది అగ్రవర్ణ పేదలు మొత్తం 1193 మందికి రూ.1.78 కోట్ల లబ్ధి చేకూరనుంది.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకంలో గత ఏడాది నేను లబ్ధిపొందాను రూ. 15వేలు వచ్చాయి. ఆర్థికంగా ఆ డబ్బు ఉపయోగపడింది. ఈబీసీ నేస్తం పథకం వల్ల నాలాంటి నిరుపేదలకు మేలు జరుగుతోంది. జగనన్న పేదప్రజల కోసం చాలా మంచి పనులు చేస్తున్నాడు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని దేవుని ప్రార్థిస్తాను.

–పి.ప్రమీల, పార్వతీపురం

జిల్లాలో మండలాల వారీ వివరాలు ఇలా..

మండలం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి రూ.లక్షల్లో
గురుగుబిల్లి	23	రూ. 3.450
గుమ్మలక్ష్మీపురం	13	రూ.1.950
జియమ్మవలస	20	రూ.3.000
కొమరాడ	26	రూ. 3.900
కురుపాం	2	రూ.3.900
భామిని	55	రూ. 8.250
పాలకొండ	32	రూ. 4.800
పాలకొండ అర్బన్	35	రూ. 5.250
సీతంపేట	2	రూ.30,000(వేలు)
వీరఘట్టాం	30	రూ. 4.500
బలిజిపేట	112	రూ.16.800
పార్వతీపురం	94	రూ. 14.100
పార్వతీపురం అర్బన్	151	రూ. 22.650
సీతానగరం	71	రూ. 10.650
మక్కువ	57	రూ. 8.550
పాచిపెంట	134	రూ. 20.100
సాలూరు	71	రూ. 36.150
సాలూరు అర్బన్	241	రూ.75.450

మూడవ విడత నిధులు నేడు జమ



వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం మూడవ విడత నిధులు పార్వతీపురం మన్యం జిల్లాలో 1193 మంది లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున అందించనున్నాం. మూడవ విడత నిధుల విడుదల కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నాం.

–ఆర్.గడెమ్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, పార్వతీపురం మన్యం

ఏపీవీవీపీ ఉద్యోగులపై నేడు విచారణ

- విచారణ అధికారిగా శ్రీకాకుళం డీసీహెచ్ఎస్ నియామకం

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేయడానికి సంబంధించి 2021–22 సంవత్సరంలో చేపట్టిన పలు నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని వచ్చిన ఆరోపణలపై ఏపీవీవీపీ సిబ్బందిపై విచారణకు ఆశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు గురు, శుక్రవారాల్లో సిబ్బందిపై విచారణ జరగనుంది. విచారణ అధికారిగా శ్రీకాకుళం జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ వి.రాజ్యలక్ష్మిని నియమించారు. ఆమె గురువారం ఉదయం 9:30 గంటలకు విచారణ చేపట్టనున్నారు. డాక్టర్ వి.లక్ష్మణరావు (మాజీ డీసీహెచ్ఎస్), కె. కల్పన అసిస్టెంట్ డైరెక్టర్ (డీసీహెచ్ఎస్ కార్యాలయం), వి.వి.రవితేజ (జూనియర్ అసిస్టెంట్, డీసీహెచ్ఎస్ కార్యాలయం), బొబ్బిలి శ్రీకాంత్ బయోమెడికల్ ఇంజినీర్ (ఏరియా ఆస్పత్రి ఎస్.కోట), బసవ నారాయణరావు ఎలక్ట్రీషియన్ (ఏరియా ఆస్పత్రి గజపతినగరం), ఎ.అఖిల్ కుమార్ (ప్లంబర్ ఏరియా ఆస్పత్రి గజపతినగరం), ఎం.తిరుపతిరావు రేడియోగ్రాఫర్ (భద్రగిరి సీహెచ్‌సీ), బోనెల రమేష్ (అప్తాలమిక్ అసిస్టెంట్, ఏరియా ఆస్పత్రి సాలురు), సాదునుపల్లి వెంకటరావు థియేటర్ అసిస్టెంట్ (ఏరియా ఆస్పత్రి సాలూరు), బూర్లె రమేష్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 (సీహెచ్‌సీ బొబ్బిలి)లపై విచారణ చేపట్టనున్నారు. వారు విచారణకు హాజరయ్యే విధంగా రిలీవ్ చేయాలని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

నిరాశతో సైకిల్ దిగేశాం..!



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- టీడీపీకి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రతిపక్ష టీడీపీలో తమకు ఎటువంటి సహాయం జరగలేదని, నిరాశ నిస్పృహలతో ఆ పార్టీని వీడి ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు నగరంలోని బొబ్బాది పేట, పోలయ్య పేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సమక్షంలో టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో నూతనంగా చేరుతున్న వారందరికీ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. నేటి నుంచి మనమందరం కుటుంబసభ్యుల్లా ఉంటామని, ఎప్పుడు ఎటువంటి అవసరం వచ్చినా..అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా కోలగట్ల మాట ఇచ్చారు. అనంతరం పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలోనే ఉన్నామని, అయితే అక్కడ తమను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మిని సంప్రదించగా వైఎస్సార్‌సీపీలోకి ఆమె ఆహ్వానించారని తెలిపారు. దీంతో కోలగట్ల సమక్షంలో తామంతా పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీర్ విద్యకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కీలకం

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ రంగంలో సివిల్ కోర్సులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్న వారే రాణిస్తారని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక యూనివర్సిటీలో 'ప్రతిష్ఠ 2కే24' పేరుతో రెండురోజుల పాటు జరిగిన జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ ఎల్లప్పుడూ రాయల్ సివిల్‌గా నిలుస్తుందన్నారు. నేర్చుకున్న, చదువుకున్న విద్యతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యం మెరుగుపరుచుకుంటే మంచి అవకాశాలు వస్తాయని అభిప్రాయ పడ్డారు. గౌరవ అతిథిగా హాజరైన రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయుకేటీ) ఎచ్చెర్ల డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ ఇలాంటి సింపోజియంలకు విద్యార్థులు హాజరైతే వారి మేనేజ్‌మెంట్ స్కిల్స్ మెరుగవుతాయన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను సత్కరితంచారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షతన జరిగన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, టెక్నికల్ సింపోజియం ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లుగా ఆర్.బాలమురళీ కృష్ణ, టీఎస్‌డీ ఫణీంద్రనాథ్, స్టూడెంట్ కో ఆర్డినేటర్లుగా ఎస్.లతీఫ్‌కుమార్, వై.తిరుమలదేవి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

లక్కవరపుకోట: మండలంలోని విశాఖపట్నం–అరకు జాతీయ రహదారిలో మల్లివీడు జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లివీడు గ్రామానికి చెందిన మెడిశెట్టి గుణసుందరి(40) మృతిచెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, ఎస్సై గోపాలరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కూలిపనుల నిమిత్తం గుణసుందరి పెందుర్తి వెళ్లి తిరుగు ప్రయాణంలో మల్లివీడు జంక్షన్ వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా ఎస్.కోట నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. దీంతో ఆమె రోడ్డుపై పడి తీవ్ర గాయాల పాలైంది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108 వాహనంలో కొత్తవలస తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. దీంతో ఎస్సై గోపాలరావు శవ పంచనామా నిర్వహించి మృతురాలి సోదరుడు రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యర్థుల ప్రతి ఖర్చూ లెక్కే..!

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

విజయనగరం అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రతి ఖర్చును లెక్కిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆమె తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఓట్ల జాబితా సవరణలో భాగంగా ఈ వారంలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులు, తొలగింపులకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా వెల్లడించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన పాటించాల్సిన నియమ నిబంధనలను సమావేశంలో వివరించారు. అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును లెక్కించడం కోసం ప్రత్యేక బృందాలను నియమించామని, వీడియో రికార్డింగ్ కూడా చేస్తామని తెలిపారు. యాంప్లిఫయర్లు, వాహనాలు, సమావేశ మందిరాలు, మైక్‌సెట్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, ర్యాలీ నిర్వహణకు అయ్యే ఖర్చు తదితర వివరాలను వెల్లడించారు. మార్కెట్లో ఉన్న ధరల ఆధారంగానే వాటిని నిర్ణయించామని, ఈ ధరలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీలను కోరారు. కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, వ్యయ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, రెడ్డి శంకరరావు, సోములు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పూర్తయ్యే వరకు ఓటరుగా నమోదు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ,జేసీ కార్తీక్

పార్వతీపురం: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల చివరి రోజు వరకు ఓటరుగా నమోదు కావడానికి ఫారం–6 సమర్పించవచ్చునని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆమె ఎన్నికల సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని స్పష్టం చేశారు. తుది ఓటరు జాబితా ప్రకటన అనంతరం అందిన ఫిర్యాదులు, మీడియా నివేదికల ఆధారంగా విచారణ జరిపి 1305 తొలగింపులు చేపట్టామని, వాటిలో పాలకొండ నియోజకవర్గంలో 914, కురుపాం నియోజకవర్గంలో 338, పార్వతీపురం నియోజకవర్గంలో 335, సాలూరు నియోజకవర్గంలో 88 ఉన్నాయని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పర్యవేక్షకులు ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 38 మందికి ఉద్యోగాలు



డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 38 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం బుధవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాకు డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెటిరో డ్రగ్స్, అపోలో ఫార్మసీ, బీఎఫ్ఐఎల్ కంపెనీల ప్రతినిధులు హాజరై జాబ్‌మేళాకు వచ్చిన 116 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి వారిలో 38 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా ఉద్యోగం పొందిన నిరుద్యోగులు ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉద్యోగం ఏచోట ఇచ్చినా అక్కడికి వెళ్లి పనిచేసి స్థిరపడి, తర్వాతి వారికి మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎస్ఎస్ఎస్ పీఓ బి.త్రినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా ప్రాజెక్టులు



చిత్తూరు జిల్లా పలమనేరు జెడ్పీహెచ్ స్కూల్‌లో ధ్రువీకరణ పత్రాలను అందుకుంటున్న విద్యార్థులు, సైన్స్ అధికారి కృష్ణారావు

విజయనగరం అర్బన్: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ పోటీలకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరులో బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ పోటీల్లో పాల్గొన్న 306 ప్రాజెక్టుల్లో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటాయి. వాటిలో జిల్లాకు చెందిన ఆర్ఆముదాలవలస మండలంలోని సంకిలి జెడ్పీహెచ్‌స్కూల్ 'బహుళార్థ సాధక అధునాతన సుత్తి' ప్రాజెక్టు, కొత్తవలస మండలంలోని జ్యోతి బా పూలే గురుకుల విద్యార్థిని జి.పూజిత ప్రాజెక్టు 'జీవ సంచులు' ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు తెలిపారు.

రాముడిని గుండెల్లో కొలువుంచాలి



ఆలయ ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఆహోబిలం జియర్ స్వామి

విజయనగరం: నగరంలోని నాగవంశం వీధిలో వేంచేసి ఉన్న సీతారామచంద్ర ఆలయాన్ని అహోబిలం జియర్ స్వామి బుధవారం ప్రారంభించారు. ఈ మేరకు ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రారంభానికి ముందు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం అహోబిలం జియర్ స్వామి భక్తులను ఉద్దేశించి అభిభాషణ చేశారు. గుడిలో ఉన్న రాముడిని ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకోవాలని హితబోధ చేశారు. మనిషి జీవనంలో ప్రతి గమనాన్ని రామాయణం సూచిస్తుందని చెప్పారు. అందువల్ల ప్రతి వ్యక్తిలో రాముడు ఉంటాడని, రాముడి వలె నడుచుకోవాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. ప్రతి గ్రామంలో రామాలయం ఉండాలని పూర్వీకులు చెబుతూ ఉంటారని గుర్తు చేశారు. రామతత్వం తెలిసినవారు రాముని సుగుణాలు కలిగి ఉంటారన్నారు. నాగవంశం వీధిలో పురాతన ఆలయంగా ఉన్న రామాలయాన్ని జీర్ణోద్ధరించడం సంతోషంగా ఉందన్నారు. రామాలయాన్ని నిర్మించడమే కాకుండా ప్రతిరోజూ రామదర్శనాన్ని చేసుకోవాలని భక్తులకు సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ పురాతన రామాలయం శిథిలావస్థకు చేరడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ నుంచి రూ.40 లక్షల నిధుల మంజూరుకు కృషి చేశానని, తనతో (రూ.లక్ష విరాళం) పాటు స్థానికులు రూ.10 లక్షలు సమకూర్చడంతో ఆలయ నిర్మాణం పూర్తయిందని కోలగట్ల వీరభద్ర స్వామి చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కనకాల నాగవల్లి, కాళ్ల సూరిబాబు, చెరుకూరి శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు బేరు సత్యనారాయణ, పల్లా నారాయణరావు, మద్దిల శ్రీనివాసరావు, మద్దిల దుర్గారావు, కనకల సూర్యనారాయణ, కనకల పైడిరాజు పాల్గొన్నారు.

17 నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు



జాతరకు ముస్తాబవుతున్న ఆలయం

- మూడు రోజుల పాటు నిర్వహణ
- పూర్తయిన ఏర్పాట్లు

రాజాం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పోలిపల్లి పైడితల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. 98వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నుంచి జరగనున్న జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముందుగా ఈనెల ఈనెల 15న గుడిలో నేత్రోత్సవం నిర్వహించిన అనంతరం 17 నుంచి జాతర ప్రారంభం కానుంది. మూడు రోజుల జాతరకు శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, విజయవాడ, ఒడిశా తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో జాతరకు రానున్నారు.

వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

జాతరలో భాగంగా ఈనెల 17న ఎస్‌వీ రమణా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పౌరాణిక నాటకపోటీలు ఏర్పాటుచేశారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతిని అందజేయనున్నారు. 18న రాజాం ప్రాంతీయ కళాకారుల సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీరామాంజనేయ యుద్ధం(యుద్ధసీను) నాటకం ప్రదర్శించనున్నారు. అదేరోజు రాత్రి 10 గంటలకు జానకీరామ్ శిష్య బృందంతో రేలా రే రేలా సాంస్కృతిక ప్రదర్శన జరగనుంది. 19న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఘటోత్సవంతో జాతర మహోత్సవం ముగుస్తుందని ఆలయ అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ వివరించారు. అదేరోజు రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు ఈఓ బీవీ మాధవరావు వెల్లడించారు.

సేవాకార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు

జాతర సందర్భంగా చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ శిబిరాలను సత్యసాయి భక్తులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు ఏర్పాటుచేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడికక్కడే చలివేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు వాకచర్ల దుర్గాప్రసాద్, సలాది తులసీదాస్, ఆర్నేపల్లి వెంకటనాయుడు, వెంపల లక్ష్మణరావు, పెంకి చైతన్యకుమార్‌లు పేర్కొన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల పరిశీలన




గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్

విజయనగరం అర్బన్: పట్టణంలో ఈ నెల 17వ తేదీన జరగనున్న గ్రూప్–1 రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఆయా కేంద్రాలకు వెళ్లి పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న వసతులపై ఆరా తీశారు. నగరంలోని ఆర్.కె.జూనియర్ కళాశాల, గాయత్రి డిగ్రీ కళాశాల, శ్రీనివాస జూనియర్ కళాశాల, శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల తదితర 14 కేంద్రాలను ఆయన పరిశీలించారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధానం

- వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లు తప్పనిసరి
- జాయింట్ కలెక్టర్ శోభిక



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శోభిక

పార్వతీపురం: రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు మరమ్మతులకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రులు ఐఆర్ఏడీ యాప్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలు, విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లు తప్పనిసరిగా బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి సి.మల్లికార్జునరెడ్డి, ఏఎస్పీ సునీల్ శ్రవణ్, జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, ఆర్అండ్‌బీ, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.